మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పాల్గొన్న అధికారులు

శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 13(నమస్తే తెలంగాణ): బక్రీద్ పండుగను శాంతియుతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలను కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు ఎనిమల్స్ ఆధ్వర్యంలో, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా పశు వైద్యాధికారి విజయ శేఖర్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ముస్లిం మత పెద్దలతో పోలీస్‌శాఖ పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి, జంతు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. జంతువుల నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా లేదా 3 నెలలు జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. జిల్లాలో తూప్రాన్ టోల్‌గేట్, నర్సాపూర్ చౌరస్తా, కోలపల్లి చెక్‌పోస్టుల వద్ద పోలీసు, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులతో సమీకృత చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తారని, పశువుల అక్రమ రవాణాను నిరోధించి, పట్టుబడిన పశువులను దగ్గరలోని గోశాలలకు తరలించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి ముందుగానే బైండోవర్ చేయాలని పోలీస్ శాఖకు తెలిపారు. మెదక్‌లో ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అతి త్వరలో ప్రారంభించాలని మెదక్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. సమావేశంలో పోలీసు, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ డాక్టర్ బాలాస్వామి

మెదక్ అర్బన్, జూన్ 13: జిల్లాలో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బాలస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలు, గోడలను తాకరాదని, వాటికి కరెంట్ షాక్ వచ్చి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. నది తీర గ్రామాల్లో పెద్దలు తమ పిల్లలను నదుల్లోకి వెళ్లకుండా చూడాలని, వాగులు వంకల్లోనూ నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఉధృతంగా నదులు ప్రవహించినా, అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్, బారిగేడ్స్, హెచ్చరికల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వర్షాలకు ఇండ్లు కూలే ప్రమాదం ఉంటే సంబంధిత పంచాయతీ, రెవెన్యూ అధికారుల సహకారంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సాయం అందించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

నర్సాపూర్, జూన్ 13 : ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ కలిగిన బస్సులు, అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. పాఠశాలలో తప్పనిసరిగా మొక్కలు నాటి, టాయ్‌లెట్స్, స్కూల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో విద్యా బోధన ఉండాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరి, రాంచందర్, నాయకులు రమేశ్‌యాదవ్, బాల్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, భిక్షపతి, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వెల్దుర్తిలో కార్మికులతో కలిసి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

వెల్దుర్తి, జూన్ 13: గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం వెల్దుర్తి పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలు, పని విధానం, పనిభారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నాయకులు గౌరయ్య, నరేందర్, మైసయ్య, పెంటయ్య, యాదయ్య, రవి, కుమార్, ప్రభాకర్, శేకులు పాల్గొన్నారు.

ఎంపీని గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

ఘనంగా ఎంపీ విజయోత్సవ ర్యాలీ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 13: బీజేపీ ఎంపీగా రఘునందన్‌రావు విజయం సాధించడంతో జిల్లా కేంద్రంలో గురువారం విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, ప్రధాన రహదారి గుండా సాయిబాలాజీ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిబాలజీ గార్డెన్‌లో నిర్వహించిన అభినందన సభలో బీజేపీ శ్రేణులు, వ్యాపార, వాణిజ్య వర్గాలు ఎంపీని ఘనంగా సన్మానించారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నర్సింగరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాట్రియాల గ్రామంలో బోనాలతో ఊరేగింపు

ఘనంగా మడలేశ్వర స్వామి బోనాలు

రామాయంపేట, జూన్ 13: మండలంలోని కాట్రియాల గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి కల్యాణం, అభిషేకం, మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో రజకులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో ఇంటికో బోనం తీశారు.

రైతన్నా.. జర జాగ్రత్త

కొమురవెల్లి : వరి సాగు కోసం ట్రాక్టర్‌తో దుక్కి దున్నతున్న రైతు

- విత్తనాలు, ఎరువులపై అప్రమత్తంగా ఉండాలి
- గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు కొనాలి
- అన్నదాతలకు వ్యవసాయాధికారుల సూచనలు

పెద్దశంకరంపేట/ కొమురవెల్లి, జూన్ 13: వానకాలం సాగుకు అన్నదాత సన్నద్ధమవుతున్నాడు. సకాలంలో వర్షాలు కురవడంతో సాగుకు భూములు సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో వరి, పత్తి, వేరుశనగ, తదితర పంటలపై రైతాంగం దృష్టి సారిస్తుంది. దీంతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొంటున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ విత్తనాలు రాకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో కొంటున్నారు. ఈ సమయంలోనే రైతులు తొందరపడవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తక్కువ ధరలతో ఎక్కువ దిగుడి వస్తుందంటూ ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు నమ్మబలికి విత్తనాలను అంటగట్టేస్తున్నారు. దీంతో అనేక చోట్ల నకిలీ విత్తనాల బారినపడిన రైతులు నష్టపోతున్నారు. నేల సాంద్రత, స్వరూపం, ఆ ప్రాంత వాతావరణ పరిస్థితులను బట్టి, సమీప వ్యవసాయాధికారుల సూచనలు పాటించి, పంటలు సాగు చేయాలి.

రైతులు తీసుకోవాల్సి జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన దుకాణాల్లోనే విత్తనాలను కొనాలి.
- బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ సంస్థ పేరు లేబుల్, పరిమాణం, విత్తనం ధర, అమ్మిన వారి సంతకం, వంటి వివరాలు ఉండాలి.
- కొనుగోలు చేసిన విత్తనాల బిల్లును తప్పని సరిగ్గా తీసుకోవాలి
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువ పత్రం బిల్లులు పంట చేతికొచ్చే వరకూ భద్రంగా ఉంచుకోవాలి.
- లేబుల్ లేని డబ్బాలు, సీసాలు, ప్యాకెట్లు ఎట్టి పరిస్థితుల్లో కొనద్దు
- మందులకు సీల్ ఉందో లేదో పరిశీలించి కొనాలి. సీల్ లేకుండా ఉంటే కొనొద్దు.
- చెలామణిలో ఉన్న ఎరువులు, పురుగు మందులను పోలిన ప్రత్యామ్నాయ పేర్లతో విక్రయాలు జరగుతుంటాయి. వీటిని జాగ్రత్తగా గమనించాలి.
- ఒక్కోసారి తక్కువ ధరకే ఎరువులు, పురుగు మందులు అంటూ గ్రామాల్లోకి వ్యాపారులు వస్తుంటారు. ఇలాంటివి సరైనవో కావో క్షుణ్ణంగా పరిశీలించాలి.
- నకిలీ విత్తనాలతో మోసమోతే వ్యవసాయాధికారులు, పోలీసులకు పిర్యాదు చేయవచ్చు.

పరిహారం కోసం..

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుంది. విత్తనాల ప్రమాణాల కన్నా తక్కువ మొలకశాతం ఉండి, దిగుబడిపై ప్రభావితం చూపితే కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయవచ్చు. అధికారుల ద్వారా తగిన నష్టపరిహారం పొందవచ్చు.

పెద్దశంకరంపేట : ఫర్టిలైజర్ షాపులో ఎరువులు, విత్తనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

అధికారుల సూచనలు పాటించండి

విత్తనాలు కొనేటప్పుడు దగ్గరలోని వ్యవసాయాధికారికి అడిగి, వారిచ్చే సూచనలు తప్పకుండా పాటించాలి. విత్తనాలు కొనేటప్పుడు అవి మేలు రకమైనవా.. కావా చూసి తీసుకోవాలి. నాసిరకం విత్తనాలు వ్యాపారులు ఇవ్వాలని చూస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వండి.

- రాంప్రసాద్, ఏడీఏ, పెద్దశంకరంపేట

జాగ్రత్తలు పాటించాలి

ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనేటప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. రైతులు సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపితే నకిలీ ఎరువులు, పురుగుల మందుల బెడదా ఉండదు.

- నరేశ్, మండల వ్యవసాయాధికారి, కొమురవెల్లి

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- జడ్పీ సీఈవో ఎల్లయ్య
- కొనసాగుతున్న బడిబాట
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు

రేగోడ్, జూన్ 13: మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం నిర్వహించిన బడిబాటలో జడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు సుశీల, అంజిబాబు ఉపాధ్యాయులు ప్రతాప్, అశోక్, సంజీవులు, శివాని, శివకుమార్, నవీన్ కుమార్ ఉన్నారు.

రేగోడ్ : మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

వెల్దుర్తి : మానేపల్లిలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఎంఈవో, నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వెల్దుర్తి, జూన్ 13. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీపీ స్వరూపా నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మానేపల్లి, యశ్వంతరావుపేట, మన్నెవారి జలాల్‌పూర్‌లో ఉన్న పాఠశాలలను ఎంఈవో యాదగిరి, నాయకులతో కలిసి సందర్శించారు. మానేపల్లిలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. మన్నెవారి జలాల్‌పూర్‌లో వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారితో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, నాయకులు నరేందర్‌రెడ్డి, పోతిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీను, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ

చేగుంట, జూన్ 13: మండలంలో పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను మండల నోడల్ అధికారి నీరజ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, మధుసూదన్ చారి, చల్లా లక్ష్మణ్, వెంకటేశ్, చక్రధర్‌శర్మ, శారదారమ, శ్రీవాణి, భవాని, లత, రమాదేవి, రేఖా, సురేందర్, బాలరాజు, హరిరంజన్‌శర్మ, సుధాకర్, రేణుక, అరుణ, వీవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా ప్రతాప్‌రెడ్డి పుట్టిన రోజు

తూప్రాన్/రామాయంపేట, జూన్ 13: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గురువారం తూప్రాన్‌లో ఘనంగా నిర్వహించారు. మండల బీఆర్ఎస్ నాయకులు సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. రామాయంపేటలోని మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు పల్లె జితేందర్‌గౌడ్ పుట్టిన రోజును ఘనంగా పార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కొండల్‌రెడ్డి, మధునాల స్వామిగౌడ్, నవాత్ మహేశ్, ప్రసాద్, సాంగని సుధాకర్ తదితరులు ఉన్నారు.

రామాయంపేటలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పుట్టిన రోజు వేడుకలు

మహిళా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మక్కరాజిపేటలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా రైతు సంఘాలకు విత్తనాలను అందజేస్తున్న ప్రోగ్రాం లీడ్ వాణి శేఖర్, బృందం సభ్యులు

చేగుంట, జూన్ 13: మహిళా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఆధునిక పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని సెహగల్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడ్ వాణిశేఖర్ తెలిపారు. మండలంలోని మక్కరాజిపేట, పది గ్రామాలను దత్తత తీసుకుని మహిళా రైతు సంఘాలకు మొక్కజొన్న, కంది, విత్తనాలు, పురుగు మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెహగల్ ఫౌండేషన్, హైటెక్ సీడ్ కంపెనీ వారి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా రైతులను ఆధునిక వ్యవసాయ రంగంలో అధిక లాభాలు పొందేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో నారు మడులు, నాట్ల ఖర్చును తగ్గించుకుని అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, శ్రావణ్, సునీత, రైతులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే సొసైటీ ధ్యేయం

మెదక్‌రూరల్, జూన్ 13: రైతు శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయమని మెదక్ పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి అన్నారు. గురువారం సొసైటీ కార్యాలయంలో గొర్రెల పెంపకం యూనిట్ కోసం రుణం రూ.5 లక్షల 3వేల 550ల చెక్కును బూర్గుపల్లి గ్రామానికి చెందిన శివప్రసాద్‌కు అందజేశారు. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలు కాకుండా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో సాయికుమార్, ఘట్టయ్య, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు చెక్కును అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి

పచ్చి రొట్టతో అధిక లాభాలు

చేగుంట, జూన్ 13: పచ్చి రొట్ట జీలుగ, జనుముతో తయారు చేసిన దుక్కిలో పంటలకు కావాల్సిన పోషక విలువలు లభిస్తాయని నార్సింగి ఏఈవో విజృంభన తెలిపారు. నార్సింగి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పచ్చిరొట్టతో సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజృంభన మాట్లాడుతూ జీలుగ, జనుము ఏపుగా పెరిగిన తరువాత దుక్కి దున్నడంతో పంటకు కావాల్సిన పోషకాలు లభించి, దిగుబడి పెరుగుతుందన్నారు.

పచ్చి రొట్టతో కలిగే లాభాలను వివరిస్తున్న ఏఈవో విజృంభన

ఘనంగా నాగదేవత ఆలయ వార్షికోత్సవం

చేగుంట, జూన్ 13: చేగుంటలోని సంతాన నాగదేత దశమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, చేగుంట పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు రవికుమార్, చక్రపాణి, నాగరాజు, రాములు, సతీశ్, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ పరంజ్యోతి, కృష్ణ, వేణు పూజల్లో పాల్గొన్నారు.

తెలుగు పాఠ్య పుస్తకాలు వెనక్కి

చిన్నశంకరంపేట, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించిన తెలుగు పాఠ్య పుస్తకాలను చిన్నశంకరంపేటలోని విద్యావనరుల కేంద్రానికి గురువారం వెనక్కి పంపారు. మండలంలోని ప్రతి పాఠశాలకు గతంలోనే పాఠ్యపుస్తకాలు చేరాయి. పాఠ్యాంశంలోని మొదటి పేజీ ముందుమాటలో గత ప్రభుత్వం నాయకులు, వారి హోదాలు ఉండడంతో ఉన్నత అధికారులు ఆదేశానుసారం పాఠ్య పుస్తకాలను వెనక్కి తెప్పించినట్లు ఎంఈవో బుచ్చయ్యనాయక్ తెలిపారు.

గోవుల అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

13 మెదక్‌రూరల్ 02: మెదక్‌రూరల్ ,జూన్ 13: బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణా, గోవధను నియంత్రించడానికి చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌పటేల్ పిలుపు మేరకు మండల అధ్యక్షుడు మార్గం రాజు, ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ఆధ్వర్యంలో మెదక్‌రూరల్ సీఐ కేశవులకు వినతి పత్రం అందజేశారు.

విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ

శివ్వంపేట, జూన్ 13 : మండలంలోని పలు రైస్ మిల్లుల్లో గురువారం విజిలెన్స్, టాస్క్ ఫోర్స్ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గోమారంలోని సత్యసాయి రైస్ మిల్, దొంతిలోని శ్రీమాతా రైస్ మిల్లులో విజిలెన్స్, టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని, రికార్డులను, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం వివరాల రికార్డులను ఆరా తీశారు. మెయింటెనెన్స్‌తో పాటు పలు లెక్కలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

రేగోడ్, జూన్ 13: రేగోడ్ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ అర్హత (టీజీటీ) డిగ్రీ, బీఈడీ, గణితం (పీజీటీ) ఎంఎస్సీ, బీఈడీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో..

నర్సాపూర్, జూన్ 13: నర్సాపూర్‌లోని మైనార్టీ పాఠశాల, కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ బాలుర పాఠశాలలో పీజీటీ-ఉర్దూ, పీజీటీ-ఇంగ్లిష్, పీజీటీ-సోషల్, పీజీటీ-ఫిజికల్ సైన్స్, టీజీటీ-ఇంగ్లిష్ ఖాళీల భర్తీకి ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంగారెడ్డి జిల్లాలోని కంది ఆర్ఎల్‌సీ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. డెమో, ఇంటర్వ్యూ రూపంలో ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 7673917990 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాచ్‌ఉమన్ పోస్టు కోసం..

చిన్నశంకరంపేట, జూన్ 13: చిన్నశంకరంపేటలోని కేజీబీవీలో రాత్రి సమయంలో విధులు నిర్వహించడానికి మహిళా వాచ్‌ఉమన్ పోస్టు ఒకటి ఖాళీగా ఉందని ప్రత్యేక అధికారి గీతా గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్ఎస్‌కు విద్యార్థి ఎంపిక

సుహాసిని

నిజాంపేట, జూన్ 13: నస్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నగరం గ్రామానికి చెందిన గుగూలోత్ సుహాసిని కేంద్ర ప్రాయోజిత పథకం ఎన్ఎంఎంఎస్ఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్)కు ఎంపికైనట్లు హెచ్ఎం సత్యంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభ కనబర్చిన విద్యార్థులను చదివేలా ప్రోత్సహించడమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకానికి ఎంపికైన విద్యార్థికి ఉపాధ్యాయ బృందం, ఎంపీపీ సిద్ధిరాములు, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ అభినందనలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాలు.. ఇద్దరు మృతి

అల్లాదుర్గం, జూన్ 13: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిల్వర్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన తమ్మలి ప్రభాకర్(60) అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద ఎస్‌వీఆర్ దాబాలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి దాబా లో పని ముగించుకుని 161వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిల్వర్ శివారులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డ ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొనిగండ్ల మూలమలుపు వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మెదక్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాజయ్య (45) టీవీఎస్ ఎక్సెల్‌పై అదే గ్రామానికి చెందిన రాములుతో కలిసి రామాయంపేట నుంచి మెదక్ వైపు వారి స్వగ్రామానికి వెళ్తున్నారు. మెదక్ నుంచి రామాయంపేట వైపు కారు వస్తున్నది. తొనిగండ్ల మూలమలుపు వద్ద టీవీఎస్ ఎక్సెల్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చాకలి రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రాములుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
డాక్యుమెంట్ పోయినది
★ నా పేరు మోటం మోనిక, భర్త: రాజు, నివాసం: ఇం.నెం. 10-4-109, నాసర్‌పురా, సిద్దిపేట జిల్లా, SRO సిద్దిపేటకు చెందిన నా ఒరిజినల్ రిజిస్ట్రర్డ్ లింక్ డాక్యుమెంట్ నెం. 5220/2014, తేది: 18-11-2014 పోయినది. నేను నాసర్‌పురా, సిద్దిపేట నుండి గాంధీచౌక్, సిద్దిపేటకు ప్రయాణిస్తుండగా 10-02-2024వ తేదీన దారిలో పోయినది. ఎవరికైనా దొరికితే దయచేసి క్రింది ఫోన్‌నెంబర్‌ను సంప్రదించండి. ఫోన్: 9502003018.
NT-325815
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట